క్లుప్తంగా

జీజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



కాకుమాను: మండల కేంద్రం కాకుమాను మైనార్టీ కాలనీకు చెందిన షేక్ కరీమూన్ గత కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. ఆదివారం ఒకటవ తేదీ కావడంతో వలంటీర్ సొంగా యాకోబు గుంటూరు వెళ్లి కరీమూన్‌కు వితంతు పింఛన్ నగదును అందజేశాడు. అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతున్న తనకు ఒకటవ తేదీనే పింఛన్ నగదు అందించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కరీమూన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తనకు డబ్బు ఎంతో అవసరమని అలాంటిది ఒకటవ తేదీనే పింఛన్ అందించి ఆదుకున్నందుకు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని కరీమూన్ తెలిపారు.

పంటల్లో క్షేత్రస్థాయి పరిశీలన



గుంటూరు రూరల్: పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డీపీఎం రాజకుమారి తెలిపారు. ఆదివారం మండలంలోని జొన్నలగడ్డ, లాం గ్రామల్లో పత్తి, మిరప పంటలను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పత్తి పంటల్లో గులాబిరంగు పురుగుల నివారణకు బ్లూకలర్ అట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా పింక్ బోల్‌వార్మ్ బుట్టలను ఎకరానికి 10–12 ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెంటర్ గురవయ్య, ఎస్‌ఎఫ్‌ఏ యూన్సి, లక్ష్మి, దేవమ్మ తదితరులున్నారు.

వడ్లమూడిలో విజ్ఞాన్ విద్యార్థుల స్వచ్ఛ భారత్



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు ఆదివారం వడ్లమూడిలో స్వచ్ఛతా హీ సేవా, మెడికల్ క్యాంప్‌తో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని సూచించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసారు. గ్రామంలోని ప్రధాన రహదారులను శుభ్రం చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. గుంటూరు అమరావతి హాస్పిటల్ డాక్టర్ శివ రత్నాకర్ ఆధ్వర్యంలోని వైద్య బృందం సహాయంతో రక్త పరీక్షలతో పాటు బీపీ వంటి ఇతర పరీక్షలను నిర్వహించారు. ''ఫీడ్ ద హంగర్'' అనే నినాదంతో గుంటూరు నాయుడు పేట డంప్ యార్డ్ వద్ద నివసిస్తున్న ప్రజలకు అవసరమైన ఆహారాన్ని అందించారు. ప్రపంచంలో వేల మంది ప్రజలు సమయానికి తిండి దొరకక ఆకలితోనే నిద్రిస్తున్నారు. వృధాగా పడేసే ఆహారాన్ని అవసరమైన వారికి అందించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషిచేస్తా

గుంటూరు రూరల్: గుంటూరు అర్బన్ మండలం క్లస్టర్ 1 వైఎస్సార్ సీపీ అధ్యక్షుడుగా నియమించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని క్లస్టర్ 1 అధ్యక్షుడు ఏటుకూరి విజయసారది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు సహాయ సహకారాలు అందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్‌కు, కృష్ణ గుంటూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్స్ ఎంపీ ఆళ్ళ ఆయోధ్యరామిరెడ్డికి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు, కృతజ్ఞతలు తెలిపుతున్నానన్నారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషిచేస్తానని చెప్పారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 27వ తేదీన పెదపలకలూరు రోడ్డు గుంటూరు క్లబ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి గాయాలతో పడి ఉన్నాడనే సమాచారం మేరకు ఘటన స్థలికి పోలీసులు చేరుకున్నారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి సుమారు 40 సంవత్సరాలు వయస్సు కలిగి ఉంటాడని గ్రీన్ కలర్ టీషర్ట్, బ్లాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు నేరుగా నల్లపాడు పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

గ్రామగ్రామాన 'స్వచ్ఛతా హీ సేవా'

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారు వెంకట రోశయ్య
- చేబ్రోలులో అట్టహాసంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం
- ర్యాలీ, మానవహారం, శ్రమదానం కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న గ్రామస్థులు





చేబ్రోలు జీబీసీ రహదారిపై మానవహారంలో మహిళలు, గ్రామస్థులు, ఎమ్మెల్యే కిలారు, అధికారులు, ప్రజలు తదితరులు

చేబ్రోలు: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పొన్నూరు శాసన సభ్యుడు కిలారు వెంకట రోశయ్య అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి జీబీసీ రహదారి గుండా మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వెనుక డంపింగ్ యార్డు సమీపంలో చెత్తా చెదారం తొలగింపు పనుల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల డ్రస్ కోడ్‌ను ఎమ్మెల్యే కిలారుతో పాటు, జిల్లా, మండలాధికారులు ధరించి వారితో కలిసి పనిచేశారు. కాలువల పక్కన ఉన్న పిచ్చిమొక్కల తొలగింపు, చెత్తా చెదారం తొలగింపు పనులు చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి టీ సేవించారు. వారిని సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ సెంటర్, మండల పరిషత్ కార్యాలయాల వద్ద జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా చేబ్రోలును తీర్చిదిద్దటానికి ప్రజలు సహకరించాలన్నారు. చెత్తా చెదారంను తీసుకువెళ్లి కాలువల్లో, డ్రైయిన్‌ల్లో వేయటం వల్ల పారిశుద్ధ్యం దెబ్బతింటుందన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఆర్ కేశవరెడ్డి, జెడ్పీ సీఈవో మోహనరావు, స్పెషల్ ఆఫీసర్ పల్లవి, ఎంపీపీ కె.సాహితి, వైస్ ఎంపీపీ కాసు అనితారెడ్డి, గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, ఉప సర్పంచ్ చౌడయ్య, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బాబురావు, ఏపీఎం నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, జేఏఏ జిల్లా కోఆర్డినేటర్ పద్మాకర్, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, ఉపాధి, అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పెదకాకానిలో రోడ్లు శుభ్రం చేస్తున్నఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచి గోళ్ళ స్వరూపరాణి



చిన పలకలూరు గ్రామంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు



నడింపాలెంలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ త్రినాథ్‌బాబు



కుర్నూతల గ్రామంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ

ప్రత్తిపాడు: గ్రామ వలంటీరు నుంచి ఎంపీడీవో వరకు ఉద్యోగులు చీపుర్లు చేతబట్టారు. స్వచ్ఛతలో మేము సైతం అంటూ వీధివీధినా తమ కార్యాలయాలను శుభ్రం చేసుకోవడంతో పాటు వీధులను శుభ్రపరిచారు. స్వచ్ఛ ప్రతిజ్ఞలు చేశారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలను నిర్వహించారు.

– ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి జాన్‌పీరా ఆధ్వర్యంలో వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు పంచాయతీ కార్యాలయాన్ని శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించి, గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డును శుభ్రం చేశారు.

– పాతమల్లాయపాలెంలో సెక్రటరీ నాగిరెడ్డి నేతృత్వంలో సర్పంచ్ కాసు పద్మావతి, ఉపసర్పంచ్ సిద్ధంశెట్టి శ్రీనివాసరావులు గ్రామస్తులు, వలంటీర్లతో కలసి రక్షిత మంచినీటి చెరువు గట్టుపై పిచ్చి చెట్లు, గడ్డి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. కాసు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– వట్టిచెరుకూరు మండలం కుర్నూతల పంచాయతీలో సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవాలో వలంటీర్లు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని పారిశుద్ధ్య పనులు చేశారు. గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచుతామంటూ స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.

– పుల్లడిగుంట పంచాయతీలో గ్రామ సర్పంచ్ షేక్ ఫర్వీన్ సుల్తానా, నూరుల్లాల నేతృత్వంలో గ్రామ సంఘాలు, యువతీ, యువకుల సహకారంతో స్వచ్ఛతా హీ సేవా నిర్వహించారు. గ్రామంలోని అంతర్గత వీధులతో పాటు మంచినీటి చెరువులను శుభ్రం చేశారు.

– నడింపాలెం గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ కాలనీలోని మంచి నీటి చెరువు, శ్మశాన వాటికల్లో శ్రమదానం చేశారు. అనంతరం క్లాప్ మిత్రలను ఐటీసీ ఫినిష్ సొసైటీ సహకారంతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ త్రినాథ్‌బాబు, డీఈ రమేష్‌బాబు, ఈవోపీఆర్డీ మోషె, సెక్రటరీ ఖాజా, స్వచ్ఛభారత్ మిషన్ ఎంఆర్సీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదకాకానిలో స్వచ్ఛతా హీ సేవా

పెదకాకాని: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు పెదకాకాని గ్రామంలో ఆదివారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల అభివృద్ధి అధికారి ఎ.రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మంచి ఆరోగ్యకరమైన సమాజాన్ని భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. పెదకాకానిలో రోడ్లు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి డి.బలిరాంనాయక్, పంచాయతీ కార్యదర్శి అంగలకుదురు సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

కాకుమాను: మండలంలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చడమే లక్ష్యంగా ప్రతి అధికారి కృషి చేయాలని కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా ఆదివారం మండల కేంద్రం కాకుమాను ప్రధాన కూడలి, తాగునీటి చెరువు పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని నమ్మిన వ్యక్తి జాతిపిత మహాత్మా గాంధీ అని అలాంటి మహోన్నత వ్యక్తి జన్మదినం సందర్భంగా ఆయన కన్న కలలను సాకారం చేసేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని దీని కోసం మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులు తమ వంతు బాధ్యతగా గ్రామాల స్వచ్ఛతపై దృష్టిపెట్టాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుపులేటి శివకుమారి, ఎంపీటీసీ–2 కానుగుల పరమేశ్వరరావు, తహసీల్దార్ జె.ప్రసాదరావు, పంచాయితీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గుంటూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. ఆదివారం చిన్నపలకలూరు గ్రామంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా స్వచ్ఛభారత్ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులను శుభ్రం చేసి చెట్లకు పాదులు చేశారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ తడిచెత్త పొడిచెత్త గురించి వివరించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయరాదని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ జ్యోత్స్న, తోట నాగేశ్వరరావు, తంగెళ్ళ నాగేశ్వరరావు, ఎమ్ వెంకటేశ్వర్లు, బి.పోతురాజు, శ్రీనివాసరావు, వేమయ్య, నరేష్ గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులున్నారు.



పారిశుద్ధ్య కార్మికులతో టీ తాగుతున్న ఎమ్మెల్యే, డీపీవో, జెడ్పీ సీఈవో తదితరులు



పుల్లడిగుంటలో చెత్త కుప్పలను తొలగిస్తున్న సర్పంచ్ పర్వీన్‌సుల్తానా, నూరుల్లా



రోడ్లు శుభ్రం చేస్తున్న జెడ్పీటీసీ గుల్జార్‌బేగం, వివిధ శాఖల అధికారులు

అంకిరెడ్డిపాలెం గ్రామంలో...

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి తెలిపారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవాలో డివిజన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెం గ్రామంలో ప్రధాన వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి తదితరులున్నారు.

జొన్నలగడ్డ గ్రామంలో...

గ్రామ పరిశుభ్రత ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని జొన్నలగడ్డ గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని చెరువు, వీధులను శుభ్రపరిచారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఆలోచనలతోనే అసలైన స్వచ్ఛభారత్ సాధ్యం

– రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై వెంకటేశ్వరరావు



గుంటూరు రూరల్: స్వచ్ఛమైన ఆలోచనలతోనే అసలైన స్వచ్ఛభారత్ సాధ్యమవుతుందని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంట గ్రామంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా గ్రామంలోని వీధులను శుభ్రపరిచారు. ఆయన మాట్లాడుతూ నాగరికతతో పాటు ప్రజల జీవనశైలిలో అనేక మార్పులు జరిగి వివిధ రకాల వస్తువుల వినియోగం విపరీతంగా పెరిగిందన్నారు. అనవసరపు వస్తువులను ఉపయోగించడం వలన వాటి తాలూకు వ్యర్థాలు కూడా పేరుకుపోతున్నాయన్నారు. ఆ వ్యర్థాలను సక్రమంగా శుభ్రం చేసుకోలేక ఎక్కడపడితే అక్కడ వదలి వేస్తున్నామని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపరిశుభ్రత అనేక అనారోగ్యాలకు కారణమవుతుందని చెప్పారు. మన పక్క దేశాలైన శ్రీలంక, చైనా లాంటి దేశాలలో మనకంటే పరిశుభ్రత ఎక్కువగా పాటిస్తారని వివరించారు. పరిశుభ్రత గురించి, కాలుష్యం గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంతటి వాడే చెప్పవలసి వచ్చిందంటే మన మెదడులు ఎంత కల్మషంగా తయారయ్యాయో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధి సుంకర నాగభూషణం, శ్రీకాంత్‌రెడ్డి , పుల్లడిగుంట ప్రెసిడెంట్ సైయద్ పర్వీన్, రైతునేస్తం సిబ్బంది పాల్గొని దగ్గరలోని ప్రాంతాలను శుభ్రం చేశారు.

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనాలు

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలులోని కొమ్మమూరు చానల్ నిమజ్జన కేంద్రం వద్ద ఆదివారం వినాయక విగ్రహాల నిమజ్జనాలు కోలాహలంగా జరిగాయి. చేబ్రోలు, పొన్నూరు, గుంటూరు తదితర పరిసర సమీప ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలి వచ్చాయి. పోలీసులు, అధికారులు నిమజ్జన కేంద్రం వద్ద తగిన ఏర్పాట్లు చేశారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని గ్రామదేవత దేశాంబ అమ్మవారి గుడి వద్ద ఏర్పాటు చేసిన బ వినాయక విగ్రహం గ్రామోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. మహిళలు, యువకులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిమజ్జన కేంద్రానికి తరలివెళ్లారు. గణేష్ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.



ఐకమత్యంతో రాబోయే ఎన్నికల్లో పార్టీ శ్రేణులు పనిచేయాలి

ఎమ్మెల్యే కిలారు వెంకట రోశయ్య

చేబ్రోలు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఐకమత్యంతో పనిచేయాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారు వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ శ్రేణులతో సమావేశం జరిగింది. ఇటీవల నూతనంగా నియమితులైన పార్టీ చేబ్రోలు మండల కమిటీ అధ్యక్షుడు షేక్ పెద మస్తాన్‌వలి, పెదకాకాని చాగంటి మురళీమోహన్, పొన్నూరు రుద్రపాటి ఆదిశేషు, మున్సిపాల్టీకి ఎండీ మొహమ్మద్‌లను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుంచి అన్ని గ్రామాల్లో పార్టీ నాయకులు పర్యటించి, గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయ పరచటం, అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చేపట్టిన అభివృద్ధి పనులను వివరించటం, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తెలిపారు. నెల రోజుల పాటు జరిగే కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షులు క్రియాశీలకంగా పనిచేయాలని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు రెచ్చగొట్టి సమస్యలను సృష్టించి లబ్ధి పొందే ప్రయత్నాలను గమనించాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అవినీతి, అక్రమాలకు పాల్పడి జైలుకు వెళ్లారన్నారు. లంచాలు తినేసి కంచాలు మోగించటం టీడీపీ నేతలకే చెల్లిందన్నారు. స్కిల్ స్కాం కేసులో అవినీతికి పాల్పడినట్లు సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్ట్ జరిగిందన్నారు. కార్యక్రమంలో చేబ్రోలు, పెదకాకాని, పొన్నూరు మండలాల పార్టీ అధ్యక్షులు, పొన్నూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, దాసరి నారాయణరావు, కుర్రా పాములు, కాసు ఈశ్వరరెడ్డి, షేక్ జానీ వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ మండల అధ్యక్షులుగా నియమితులైన వారిని అభినందిస్తున్న ఎమ్మేల్యే కిలారు

పంట ఉత్పత్తుల వృథాను అరికట్టాలి

ఉద్యాన శాఖ సహసంచాలకుడు శ్రీకాంత్ రెడ్డి

గుంటూరు రూరల్: పంట ఉత్పత్తులలో వృథాలను అరికట్టి అధిక లాభాలను సాధించవచ్చని ఉద్యాన శాఖ సహసంచాలకుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోగల రైతునేస్తం ఫౌండేషన్‌లో సేంద్రియ ఉత్పత్తులు, వృథాలను అరికట్టే విధానంపై రైతు శిక్షణ సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన రైతులు చాలా నైపుణ్యవంతులని అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో పంటలలో అధిక దిగుబడులు సాధిస్తున్నారన్నారు. వచ్చిన దిగుబడులను సక్రమంగా అమ్ముకోలేకపోతున్నారని కొన్ని సమయాలలో వ్యవసాయ దిగుబడుల ధరలు విపరీతంగా తగ్గి రైతుకు సాగు గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇటీవల టమాటా ధరలు జూలై, ఆగస్టు మాసాల్లో విపరీతంగా పెరిగాయని, ప్రస్తుతం విపరీతంగా తగ్గాయన్నారు. ఈ పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే రైతులు పంటల సాగును పక్కకు పెట్టి వేరే మార్గాలు వెతుక్కునే అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. పంటలు పండించడంలో రైతులు తమ నైపుణ్యతను చూపించుకోగలుగుతున్నారు కాని ఆ పంటలను నిల్వచేసుకోవడంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటూ సక్రమంగా నిల్వచేసుకోలేక పోవడం వలన సరైన ధర లభించకపోవడమో లేదా దిగుబడి వృథా కావడమో జరుగుతుందన్నారు. కాబట్టి దిగుబడి వృథాను తగ్గించవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలను వివరించారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ రైతులు శబరీనాథ్, ఏడుకొండలు, శివనాగమల్లేశ్వరరావు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రైతునేస్తం పౌండేషన్ అధికారులు

నంబూరు వీవీఐటీలో స్వచ్ఛతా హీ సేవా



నంబూరులో స్వచ్ఛతా హీ సేవాపై ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని

పెదకాకాని: పరిసరాల పరిశుభ్రతకు గ్రామస్తులు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని కోరారు. మండలంలోని నంబూరులో ఆదివారం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివా వీవీఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, నంబూరు గ్రామ పంచాయతీ సిబ్బందితో కలసి గ్రామంలో శ్రమదానం, మానవహారాలను చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజలచే స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్ వంటి వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని కాలుష్య రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, వీవీఐటీ కళాశాల అధ్యాపకుడు మహ్మద్‌ఖాన్, వివా ఉపాధ్యాయుడు వీసీ డోమి, నంబూరు గ్రామ పంచాయతీ సిబ్బంది, , గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలి

ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి తోటివారికి సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే మద్దాళి గిరిలు తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో కేవీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మెర్ల శివకుమార్‌కు ఘన సత్కారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ఏర్పాటు చేసి డాక్టర్ శివకుమార్ అనాథలు, పిల్లలు, వృద్ధులకు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. అనాథ పిల్లలను చదివిస్తూ వారి ఉన్నతికి కృషిచేస్తున్న అతనిని అభినందించారు. కార్యక్రమంలో గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు సింగు నరశింహచౌదరి, 32వ డివిజన్ కార్పొరేటర్ వెంకట కృష్ణ ఆచారి, బి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



కేవీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే తదితరులు

ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో స్వచ్ఛ భారత్

కమ్యూనిటీ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చైతన్యకుమారి

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చైతన్యకుమారి తెలిపారు. ఆదివారం ఏక్ తారీఖ్, ఏక్ ఘంట నినాదంతో ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య భద్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో చెత్త చెదారాలను ఏరివేశారు. ప్లాస్టిక్ నిర్మూలన గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. సహజవనరుల పరిరక్షణ గురించి కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ ధనశ్రీ, డాక్టర్ నిర్మలాదేవి పాల్గొన్నారు.



కళాశాల ప్రాంగణంలో పరిసరాలను శుభ్ర పరుస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

చేబ్రోలులో హజరత్ షేక్ దావూద్‌షా బాబా జెండా ఆవిష్కరణ

చేబ్రోలు:తిరుపతి జిల్లా తడ సమీపంలోని పులికాట్ సరస్సు సముద్ర మార్గంమధ్యలో ఉన్న హజరత్ షేక్ దావూద్ షా వలి బాబా వారి నిషాని జెండాను మండల కేంద్రమైన చేబ్రోలులో ఆదివారం బాబా భక్తుడు షేక్ బాషీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వేనాడు బాబా వారి దర్గా ప్రధాన ముజావర్ ముక్తార్, పకీర్లు పాల్గొన్నారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారు ఎస్ఎం జియావుద్దీన్, స్థానిక మత పెద్దలు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. దావూద్‌షా వలి బాబా జెండాను పొన్నూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేయటం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రోశయ్య, జియావుద్దీన్‌లు ప్రారంభించారు. షేక్ బాషీద్, సుబాని, ముస్లిం, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.